www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 3 ఏప్రిల్ 2025

5

తూర్పుగోదావరి



100 మంది హృద్రోగులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

ఉండ్రాజవరం బేతిన సుబ్బమ్మ వృద్ధాశ్రమం ఆవరణలో బుధవారం నిర్వహించిన ఉచిత గుండె వైద్య శిబిరంలో సుమారు వంద మంది హృద్రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు విజయవాడకు చెందిన గుండె వైద్య నిపుణులు డాక్టర్ వై.రావు హాస్పిటల్ నిర్వాహకులు తెలిపారు. పదిమందికి ఆరోగ్య తీవ్రత దృష్ట్యా వారిని విజయవాడ ఆసుపత్రికి రావాలని సూచించారు. మరిన్ని పరీక్షలు నిర్వహించి, శస్త్ర చికిత్స అవసరమైతే చేయించు కోవాలన్నారు. వారికి శస్త్ర చికిత్స అనంతరం ఒక సంవత్సరం పాటు ఉచితంగా మందులు అందిస్తామన్నారు. ఈ సందర్భంగా వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యులకు, సహకరించిన సిబ్బందికి వృద్ధాశ్రమ నిర్వాహకులు కుదప చక్రపాణి కృతజ్ఞతలు తెలిపారు.

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురు మృతి

కాకినాడ జిల్లా ఏలేశ్వరం, పెద్దాపురంలో జరిగన రెండు వేర్వేరు ఘటనలో నలుగురు మృతి చెందారు. ఈత సరదా ఇద్దరు యువకులను బలితీసుకోగా, నూకాలమ్మ జాతరకు వెళ్లిన ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు స్నానం చేస్తూ గల్లంతయ్యారు.

- ఈతకు వెళ్లి ఇద్దరు, జాతరలో స్నానమాచరిస్తూ మరో ఇద్దరు మృతి
- మృతుల్లో ఒకరు బాలుడు
- ఏలేశ్వరం, పెద్దాపురంలో ఘటనలు

ప్రజాశక్తి - పెద్దాపురం, ఏలేశ్వరం

ఈత సరదా ఇద్దరు యువకులు ప్రాణాలను బలిగొంది. ఏలేశ్వరం ఎస్ఐ ఎన్.రామలింగేశ్వరరావు తెలిపిన వివరాల మేరకు జగ్గంపేటకు చెందిన ఏడుగురు యువకులు నీలాద్రి జగన్‌కుమార్, దేవర దేవీశ్రీప్రసాద్, కొల్లుబోయిన విజయ్‌కుమార్, పర్రి సునీల్, వైభోగుల నారాయణమూర్తి, దేవర జీవన్‌కుమార్, మొల్లి వీరవెంకటకుమాటర్ బుధవారం ఉదయం తాపీ పనికి వెళ్లారు. పని ముగించుకుని సాయంత్రం ఈత కొట్టేందుకు కిర్లంపూడి మండలం కృష్ణవరం, ఏలేశ్వరం మండలం పెద్దనాపల్లి మధ్యగల ఏలేరు కాలవలో దిగారు. నీటి ప్రవాహం అధికంగా ఉండడంతో ఏడుగురు కొట్టుకుపోయారు. వీరిలో నీలాద్రి జగన్‌కుమార్, దేవర దేవీశ్రీప్రసాద్, కొల్లుబోయిన విజయ్‌కుమార్, పర్రి సునీల్, వైభోగుల నారాయణమూర్తి ప్రాణాలతో బయటపడ్డారు. మరో ఇద్దరు జగ్గంపేటకు చెందిన దేవర జీవనకుమార్(19), మొల్లి వీరవెంకటదుర్గాతరుణ్ (19) నదిలో కొట్టుకు పోయారు. సమాచారం తెలుసుకున్న జగ్గంపేట సిఐ వైఆర్‌కె.శ్రీనివాసరావు, కిర్లంపూడి ఎస్ఐ జి.సతీష్, ఏలేశ్వరం ఎస్ఐలు హుటాహుటిన ఘటనా ప్రాంతానికి చేరుకున్నారు. గజ ఈతగాళ్లతో కాలువలో గాలింపు చర్యలు చేపట్టారు. పెద్దనాపల్లి వద్ద యువకుల మృతదేహాలను గుర్తించారు. మృతదేహాలను పోస్టు మార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఒకే ప్రాంతానికి చెందిన ఇరువురు యువకులు మృతి చెందడంతో జగ్గంపేట యాదవ వీధిలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతుడు తరుణ్ తండ్రి మొల్లి రాంబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



బాలుని మృతదేహాన్ని పట్టుకుని రోదిస్తున్న కుటుంబ సభ్యులు



ఈతకు వెళ్లి మృతి చెందిన యువకులు

జాతరలో విషాదం

కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం కాండ్రకోటలో మంగళవారం నూకాలమ్మ జాతరలో విషాదం నెలకొంది.కాకినాడ జగన్నాథపురానికి చెందిన కొప్పాడి బాలు కుటుంబం ఈ జాతరకు వచ్చింది. జాతరలో పాల్గొన్న అనంతరం కొప్పాడి బాలు(22), పిరమాడి విశాల్(7) ఏలేరు కాలువలో స్నానం చేసేందుకు వెళ్లారు. రాత్రి వరకు వీరు తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందరాఉ. మంగళవారం అర్ధరాత్రి వరకు గాలింపు చేపట్టారు. ఎంతకీ ఆచూకీ దొరక్క పోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ఎస్ఐ వి.మౌనిక పర్యవేక్షణలో బుధవారం ఉదయం కాండ్రకోట ఏలేరు కాలువలో గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు. ఉదయం విశాల్ మృతదేహం, మధ్యాహ్నం యువకుడి మృతదేహం లభ్యమయ్యాయి. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించినట్టు ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.



ఉపాధ్యాయురాలిపై దాడికి యుటిఎఫ్ ఖండన

ప్రజాశక్తి - సీతానగరం

సింగవరం నాగరత్న నగర్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.నాగమణికుమారిపై జరిగిన దాడిని యుటిఎఫ్ తీవ్రంగా ఖండించింది. ఈ దాడికి నిరసనగా బుధవారం మధ్యాహ్నం ఉపాధ్యాయులు నాగరత్ననగర్ పాఠశాలకు చేరుకుని ప్లకార్డులు పట్టుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఐ.శ్రీమణి మాట్లాడుతూ విద్యార్థుల తప్పులను తల్లిదండ్రులకు తెలియజేయడం ఉపాధ్యాయుల బాధ్యత అన్నారు. అలా తెలియజేసినందుకు ఉపాధ్యాయురాలిపై దాడి చేయడం అమానుషమన్నారు. విధుల్లో ఉన్న ఉపాధ్యాయురాలిపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. యుటిఎఫ్ నాయకులు ఎస్.రాజు మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో భాగస్వాములైన ఉపాధ్యాయులపై ఇటీవల దాడులు పెరుగుతున్నాయన్నారు. ఉపాధ్యాయులకు రక్షణ కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు జరగకుండా తల్లిదండ్రులు, ప్రజలు ఉపాధ్యాయులతో బాధ్యతాయుతంగా మెలగాలని సూచించారు. ప్రధాన కార్యదర్శి ఆర్.పాపారావు మాట్లాడుతూ తల్లిదండ్రులు విద్యార్థుల ముందే ఉపాధ్యాయులపై దాడి చేయడం, దుర్భాషలాడటం ద్వారా ఎలాంటి క్రమశిక్షణ నేర్పుతారని ప్రశ్నించారు. నిందితులను శిక్షించాలని, మహిళా ఉపాధ్యాయులకు రక్షణ కల్పించాలని పలువురు సీనియర్, మహిళా ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. అనంతరం సీతానగరం పోలీస్ స్టేషన్, ఎంపిడిఒ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో వివిధ ఉపాధ్యాయ సంఘాల నేతలు, ఉపాధ్యాయులు, మహిళా విభాగం కార్యకర్తలు పాల్గొన్నారు.

సిపిఎం ఆలిండియా మహాసభ సందర్భంగా పతాకావిష్కరణ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

సిపిఎం 24వ అఖిలభారత మహాసభ ప్రారంభ సూచికంగా శ్యామల సెంటర్ వద్దనున్న సిపిఎం కార్యాలయంలో ఆ పార్టీ సీనియర్ నాయకులు ఎస్ఎస్.మూర్తి అరుణపతాకాన్ని బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 2వ తేదీ నుంచి 6వ తేదీ వరకూ తమిళనాడు మధురైలో ఈ సభ జరుగుతుందన్నారు. రాబోయే మూడేళ్లలో ప్రజా ఉద్యమాలకు ఈ సభ దిశా, నిర్దేశం చేస్తుందన్నారు. దేశంలోని పేదలు, కార్మికుల సమస్యలపై చర్చ జరుగుతుదంన్నారు. దేశ సంపదను మోడీ ప్రభుత్వం కార్పొరేట్లకు అప్పనంగా కట్టబెడుతుంద్నారు, ప్రజలపై అధిక భారాలు వేస్తుందన్నారు. ప్రజలను కులం, మతం పేరుతో చీల్చే మనువాదంపై ప్రజలను కలుపుకుని పోరాడతామన్నారు. రాష్ట్రం ప్రభుత్వం ఏర్పడిన పది నెలలు దాటినా నేటికీ హామీలను అమలు చేయలేదన్నారు. సూపర్ సిక్స్ పథకాల కోసం మరో పోరాటానికి సిద్ధం కావాలన్నారు. ఆదానితో చేసుకున్న సేకి ఒప్పందాన్ని రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్ల ఏర్పాటును మానుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు బి.పూర్ణిమరాజు, ఐ.సుబ్రహ్మణ్యం, నగర కార్యదర్శి కె.రామకృష్ణ సభ్యులు పి.రామకృష్ణ, సోమేశ్వరరావు, వి.రాంబాబు పేరయ్యలింగం, వై.భాస్కర్, టి.రాజేష్, ఆర్.రామకృష్ణ, జోషఫ్, రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించండి

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని సిపిఎం నాయకులు పిలుపునిచ్చారు. 'మా ఇంటికి స్మార్ట్ మీటర్ వద్దు' అంటూ ముద్రించిన స్టిక్కర్లను బుధవారం ఆవిష్కరించారు. ఎర్రకొండపై సిపిఎం 24వ అఖిల భారత మహా సభ సందర్భంగా పార్టీ సీనియర్ నాయకులు వి.పేరయ్య లింగం అరుణపతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా సిపిఎం రాజమహేంద్రవరం నగర కార్యదర్శి కర్రి రామకృష్ణ మాట్లాడారు. పార్టీ ఆలిండియా మహా సభ మధురై నగరంలో బుధవారం ప్రారంభమైందన్నారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, కర్షక, ప్రజావ్యతిరేక, మతోన్మాదంపై చర్చించి భవిష్యత్ కార్యక్రమాన్ని రూపొందిస్తుందన్నారు. సిపిఎం తీసుకొనే నిర్ణయాలకు ప్రజలు సంపూర్ణ మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం మద్దతుతో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యుత్ ఛార్జీల భారాలు, స్మార్ట్ మీటర్ల రద్దు చేసేవరకు సిపిఎం పోరాడుతుంది. దీనికి ప్రజల మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో నగర కమిటీ సభ్యుడు పడాల రామకృష్ణ, హార్లిక్స్ ఫ్యాక్టరీ శాఖ కార్యదర్శి దడాల శేషారావు, వి.పేరయ్య లింగం, సిహెచ్ మోహన్ రావు, బిఎస్.ప్రకాష్, వి.ఉమా, సిహెచ్.రామకీష్ణ, డి.శ్రీను, రంగ స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



ఇంటర్వ్యూలకు 486 మంది హాజరు

ప్రజాశక్తి - తాళ్లపూడి


వివిధ కార్పొరేషన్లలో రుణాలు పొందేందుకు తాళ్లపూడి ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ఇంటర్వ్యూలకు 486 మంది హాజరయ్యారని ఎంపిడిఒ రమణ తెలిపారు. తాళ్లపూడి మండలానికి 65 యూనిట్లు మంజూరు కాగా 651 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. తాళ్లపూడి ఇండియన్ బ్యాంక్, ప్రక్కిలంక, పెద్దేవం స్టేట్ బ్యాంక్, పంగిడి యూనియన్ బ్యాంక్, అన్నదేవరపేట బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్‌లకు చెందిన మేనేజర్లు, ఫీల్డ్ ఆఫీసర్లు ఈ ఇంటర్వ్యూలను నిర్వహించారన్నారు. అయితే లబ్ధిదారులు ఎంపికకు సంబంధించి కూటమి నాయకులు సిఫార్సులు చేయడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సాధారణ కాన్పులను ప్రోత్సహించాలి

ప్రజాశక్తి-గోకవరం

సాధారణ కాన్పులను ప్రోత్సహించాలని గోకవరం సామాజిక ఆరోగ్య కేంద్ర ప్రధాన వైద్యురాలు, గైనకాలజిస్ట్ డాక్టర్ వనజకుమారి అన్నారు. బుధవారం ఆసుపత్రిలో గర్భిణులకు ఆమె అవగాహన కల్పించారు. సాధారణ కాన్పు వల్ల తల్లి త్వరగా కోలుకుంటుందన్నారు. కాన్పు జరిగిన మొదటి గంటలోనే తల్లిపాలు ఇవ్వచ్చని తెలిపారు. ఆసుపత్రిలో రెండు లేదా మూడు రోజులు ఉంటే సరిపోతుందన్నారు. ఆపరేషన్ వల్ల పలు ఇబ్బందులు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. గర్భిణి ఆరోగ్య పరిస్థితులను బట్టి అవసరమైతేనే ఆపరేషన్ చేయించుకోవాలన్నారు.

కార్టూ'నిజం'



ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు ఉపాధ్యాయులంతా నడుం కట్టాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పి.జయకర్, ఎ.షరీఫ్ పిలుపునిచ్చారు. ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించేందుకు యుటిఎఫ్ రాష్ట్ర సంఘం చేపట్టిన ప్రచార కార్యక్రమంలో భాగంగా బుధవారం యుటిఎఫ్ జిల్లా సంఘం బొమ్మూరు కలెక్టరేట్ వద్ద కరపత్రాన్ని ఆవిష్కరించింది. రాష్ట్ర కార్యదర్శి ఎన్.అరుణకుమారి నేతృత్వంలో 'ప్రభుత్వ బడిలో విద్యార్థులను చేర్పిద్దాం' పేరిట ప్రచురించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు బలంగా ఉంటేనే ఆ సమాజం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. ఉపాధ్యాయులందరూ పాఠశాలలు విద్యార్థులతో కళకళలాడే శ్రద్ధ వహించాలన్నారు. అధ్యక్ష కార్యదర్శులు జయకర్, షరీఫ్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు తాము పనిచేసే పాఠశాలల అవాస ప్రాంతంలో తల్లితండ్రులు విద్యార్థులతో కలిసి కరపత్రాలు పంచి ప్రభుత్వ పాఠశాలల ప్రయోజనాలు వివరించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలను కాపాడేందుకు ఉపాధ్యాయులు ఉద్యమస్ఫూర్తితో పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు ఐ.రాంబాబు, ఎం.విజయ గౌరీ, కోశాధికారి ఇవిఎస్ఆర్ ప్రసాద్, జిల్లా కార్యదర్శి కె.రమేష్, చిలుకూరి శ్రీనివాసరావు, దయానిధి మనోజ్, రవిబాబు వివిధ మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పెద్ద ఎత్తున ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



పంగిడిలో 'తిరుమల' నూతన శాఖ ప్రారంభం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

పంగిడి-కాపవరం జంక్షన్ సమీపంలో హైవే పక్కన నూతనంగా ఏర్పాటు చేసిన తిరుమల విద్యాసంస్థల క్యాంపస్‌ను తిరుమల విద్యాసంస్థల ఛైర్మన్ నున్న తిరుమలరావు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా తిరుమలరావు మాట్లాడుతూ రాష్ట్రంలో మొదటిగా రాజమహేంద్రవరంలోని కాతేరు వద్ద తిరుమల విద్యాసంస్థలను స్థాపించామన్నారు. అనంతరం విశాఖపట్నం, భీమవరం, పాయకరావుపేట, తణుకులో నెలకొల్పామన్నారు. తాజాగా పంగిడిలో నూతన శాఖను ప్రారంభించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విలువలతో కూడిన విద్యను అందరికి అందించాలనే సదుద్దేశంతో తిరుమల విద్యాసంస్థను స్థాపించామని తెలిపారు. కొవ్వూరు, చాగల్లు, దేవరపల్లిలోని పూర్వ విద్యార్థులు, తల్లిదండ్రులు శ్రేయోభిలాషుల కోరిక మేరకు పంగిడిలో ఏర్పాటు చేశామన్నారు. ఈ క్యాంపస్‌లో ఎల్‌కెజి నుంచి పదవ తరగతి, జూనియర్ ఇంటర్ డే స్కాలర్ క్లాసులు నిర్వహిస్తామన్నారు. చుట్టుప్రక్కల అన్ని ప్రాంతాలకు బస్సు సౌకర్యం కల్పించామన్నారు. ఈ ఏడాదికి సంబంధించి అడ్మిషన్లు జరుగుతున్నాయని తెలిపారు. అడ్మిషన్లు, ఇతర వివరాలకు 8096397777, 8096497777 నెంబర్లను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరు ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు, మాజీ మంత్రి జవహర్, డాక్టర్ సాంబశివరావు, తిరుమల డైరెక్టర్ నున్న సరోజినీదేవి, అకడమిక్ డైరెక్టర్ జి.సతీష్‌బాబు, ప్రిన్సిపల్ యు.శ్రీహరి, చాగల్లు, పంగిడి, కొవ్వూరుకు చెందిన నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



నూతన శాఖ ప్రారంభోత్సవం సందర్భంగా పూజలో పాల్గొన్న తిరుమలరావు

ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యం

ప్రజాశక్తి - సీతానగరం

సీతానగరం మండలంలోని చినకొండేపూడిలో ధాన్యం కొనుగోళ్లలో అధికారుల నిర్లక్ష్యంపై రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దాదాపు 50 ఎకరాల్లో పండించిన ధాన్యం కొనుగోలు ఆలస్యం కావడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ ప్రకటించడంతో వారిలో తీవ్ర ఆందోళన నెలకొంది. నెలల తరబడి కష్టపడి పండించిన ధాన్యాన్ని నిల్వ చేయడానికి గోదాములు లేవని, కనీసం మంచి ధరకు అమ్ముకునే అవకాశం కూడా లేదని వారు వాపోతున్నారు. అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. లేకపోతే పెద్ద ఎత్తున నిరసనలు చేపడతామనిరైతులు చావా సూరిబాబు, చావా బుజ్జియ్య, సింహాద్రి గంగారావు, సింహాద్రి తాతారావు, సింహాద్రి శ్రీనివాస్, కాండ్రు విశ్వేశ్వరరావు, కనుమూరి రాఘవులు, కాండ్రు నవీన్, కారటూరి సోమరాజు, యనమందుల వెంకటరత్నం, గుర్రం నాగరాజు హెచ్చరిస్తున్నారు.

ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు అభినందన

ప్రజాశక్తి- పెరవలి

విద్యలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు పలువురు అభినందనలు తెలిపారు.మండలంలోని తీపర్రు మండల పరిషత్ పాఠశాల నెం-1లో ఏర్పాటు చేసిన అభినందన సభకు ముఖ్యఅతిథులుగా ఎంఇఒలు బి.బాలసుబ్రహ్మణ్యం, షేక్ నూర్జహాన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల నుంచి కోడూరి అఖిలేష్ నవోదయలో సీటు సాధించడం పాఠశాలకు గర్వకారణం అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్య అభ్యసిస్తున్న ఆణిముత్యాలను వెలికి తీయాలన్నారు. పలువురు గ్రామస్తులు విద్యార్థిని అభినందించారు ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం పి.చాముండేశ్వరి, విద్యా కమిటీ సభ్యులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. కానూరు ప్రాథమిక పాఠశాల నెం-3లో నందు బుధవారం ప్రపంచ ఆటిజం దినోత్సవాన్ని నిర్వహించారు. ఎంఇఒ-2 షేక్ నూర్జహాన్ అధ్యక్షతన అవగాహనా సదస్సు నిర్వహించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం షేక్ మస్తాన్, ఉపాధ్యాయులు పి.నాగమణి, కె.శాంతి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సీతానగరం ఎపిఒగా సత్యవతి

ప్రజాశక్తి - సీతానగరం

సీతానగరం మండల అదనపు ప్రోగ్రాం అధికారి(ఎపిఒ)గా బివి.సత్యవతి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఆమెకు సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సత్యవతి మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు చేరవేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధి అభివృద్ధి పనులను వేగవంతం చేస్తానని హామీ ఇచ్చారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆమె సూచించారు. ఇప్పటి వరకూ ఎపిఒగా బాధ్యతలు నిర్వహించిన నాగశేషవేణి అనపర్తి నియోజకవర్గం రంగంపేట మండలానికి బదిలీ అయ్యారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

4న విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - చాగల్లు

చాగల్లు మండలం కలవలపల్లి సబ్ స్టేషన్ పరిధిలోని 11కెవి ఫీడర్లకి వార్షిక మరమ్మతుల్లో భాగంగా ఈ నెల 4న ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నామని మండల విద్యుత్ శాఖ అధికారి ఎస్.త్రిమూర్తులు తెలిపారు. వ్యవసాయ విద్యుత్ ఉదయం 4 గంటల నుంచి 8 గంటల వరకు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ సరఫరా చేస్తామన్నారు. వినియోగదారులు గుర్తించి తమకు సహకరించాలన్నారు.

కడియపులంక మాజీ సర్పంచ్ సత్యనారాయణ మృతి

ప్రజాశక్తి-కడియం



కడియపులంక మాజీ సర్పంచ్ గట్టి సత్యనారాయణ(85) బుధవారం మృతి చెందారు. సత్యనారాయణకు భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుమారులు సుబ్బారావు, నరసయ్యలు రాజమహేంద్రవరం రూరల్ రాజకీయాల్లో కీలక నాయకులుగా ఉన్నారు. రెండవ కుమారుడు నరసయ్య కడియపులంక సర్పంచ్‌గా సేవలందించారు. సత్యనారాయణ సుదీర్ఘకాలంలో రాజకీయాల్లో కొనసాగారు. సర్పంచ్‌గా, సొసైటీ బ్యాంక్ ప్రెసిడెంట్‌గా, సెంట్రల్ బ్యాంక్ జిల్లా డైరెక్టర్‌గా, నీటి సంఘం అధ్యక్షులుగా సేవలు అందించారు. వయోభారంతో ఆయన మృతి చెందారు. ఆయన మృతికి మంత్రి కందులదుర్గేష్, ఎంపీ దగ్గుపాటి పురందేశ్వరి, ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ఎంపిపి వెలుగుబంటి సత్య ప్రసాద్, సర్పంచ్ పాఠంశెట్టి రాంజీ తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

ఘనంగా ఐఎస్‌టిఎస్ కళాశాల వార్షికోత్సవం

ప్రజాశక్తి - రాజానగరం

రాజానగరం సమీపంలో ఐఎస్‌టిఎస్ మహిళా ఇంజినీరింగ్ కళాశాల వార్షికోత్సవం ఘనంగా జరిగింది. రెండు రోజులుగా జరుగుతున్న వార్షికోత్సవం సంబరాలు బుధవారంతో ముగిశాయి. కళాశాల ఎకడమిక్ అడ్వైజర్ కె.రమేష్ ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లను అందించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఎకడమిక్ అడ్వైజర్ రమేష్ మాట్లాడారు. విద్యార్థులు మెరుగైన ప్రతిభ కనబరిస్తే ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగాలు వస్తాయన్నారు. కళాశాల చైర్మన్ కె.ఉపేందర్‌రెడ్డి వైస్ చైర్‌పర్సన్ అనూష రెడ్డి మాట్లాడుతూ వ్యక్తిగత నైపుణ్యం పెంచుకుని ప్రస్తుత పోటీ ప్రపంచంలో అన్ని రంగాల్లో ముందుకు వెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వై.రాజశ్రీరావు, అధ్యాపకులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థినికి జ్ఞాపికను అందిస్తున్న చైర్మన్ ఉపేంద్ర రెడ్డి

రుణ ప్రణాళికకు శిక్షణా తరగతులు

సీతానగరం : మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి స్వయం సహాయక సంఘాల సభ్యులకు రుణాలు మంజూరు చేసేందుకు శిక్షణా కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మండల సమాఖ్య అధ్యక్షురాలు కందికట్ల అరుణకుమారి అధ్యక్షతన నిర్వహించారు. ఎపిఎం జిలానీ ఆర్థిక రుణ ప్రణాళికల గురించి వివరించారు. మండల స్థాయిలో 236 మంది ఎన్యూమరేటర్లను ఎంపిక చేసి, ప్రతి ఎన్యుమరేటర్‌కు 5 నుండి 6 సంఘాలను ట్యాగ్ చేశారు. ప్రతి సంఘం లైవ్ మీటింగ్ నిర్వహించే విధంగా సంఘం సమావేశం స్థలాన్ని జియో ట్యాగ్ చేయాలని, ప్రతి సభ్యురాలు హాజరు కావాలని, అందరికీ ఫోటో తీసుకుని, అటెండెన్స్ తీసుకోవాలని సూచించారు. సంఘం సభ్యుల కుటుంబ జీవనోపాధి వివరాలు, ఆర్థిక సంవత్సరానికి వారి ఆదాయం, కుటుంబ సభ్యుల వృత్తి, ఉద్యోగాలు నమోదు చేయాలని తెలిపారు. సభ్యులకు జీవనోపాధి నిమిత్తం భవిష్యత్తులో 2025-26 సంవత్సరంలో అవసరమయ్యే రుణాలను కూడా ఈ సర్వేలో నమోదు చేసి, రుణం పొందే విధంగా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. విఒఎలను సూపర్‌వైజర్లుగా ఉంచి, ఎన్యుమరేటర్లతో డేటా ఎంట్రీ చేయించాలని తెలిపారు. గురువారంతో ఈ శిక్షణ ముగుస్తుందని ఎపిఎం జిలానీ తెలిపారు. ఈ కార్యక్రమంలో సిసి హరిబాబు, ధారా లక్ష్మి, ఎం.వెంకటలక్ష్మి, విఒఎలు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులపై సమీక్షా సమావేశం

ప్రజాశక్తి - సీతానగరం

సీతానగరం ఎంపిడిఒ కార్యాలంయలో ఉపాధి హామీ సిబ్బందితో వారాంతపు సమావేశం నిర్వహించారు. ఎపిఒ సత్యవతి ఈ సమావేశానికి అధ్యక్షత వహించి మాట్లాడారు. ఈ సమావేశంలో 2025-2026 సంవత్సరానికి ఉపాధి హామీ పనుల లక్ష్యాలను నిర్దేశించారు. ఎంపిడిఒ మాట్లాడుతూ ప్రతి గ్రామ పంచాయతీలో పూర్తి స్థాయిలో ఉపాధి పనులను నిర్వహించాలన్నారు. ప్రతి ఒక్కరికీ సగటు వేతనం రూ.307 వచ్చేలా చూడాలన్నారు. ఫారం పాండ్, కాలవ పనులు, చెరువు పూడికతీత పనులు చేయించాలన్నారు. ఈ సమావేశంలో ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

పురుగు మందు తాగిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి-రావులపాలెం

పురుగుల మందు తాగిన వ్యక్తి పరిస్థితి విషమించి మృతి చెందిన సంఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎస్.రాము తెలిపారు. ఊబలంకకు చెందిన దామోదర కోటేశ్వరరావు అనారోగ్యం కారణంగా మానసిక స్థితి సరిగా లేనందున ఇంటి వద్ద ఉంటూ బుధవారం పురుగు మందు తాగడంతో స్థానిక ఆసుపత్రిలో చేర్చారు. మెరుగైన వైద్య నిమిత్తం రాజమండ్రి ప్రభుత్వాసుపత్రికి తరలించడగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుమారుడు దామోదర వెంకన్నబాబు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మాజీ యానిమేటర్‌పై ఫిర్యాదు

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

మాజీ యానిమేటర్‌పై డ్వాక్రా సంఘాల మహిళలు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశారు. ఉప్పాడ కొత్త పట్నానికి చెందిన సూరి మల్ల ఆదిలక్ష్మి యానిమేటర్‌గా విధులు నిర్వహించారని, ఆ సమయంలో డ్వాక్రా గ్రూపునకు చెందిన రూ.12 లక్షల సొమ్మును ఆమె స్వాహా చేశారని తెలిపారు. ఇదే విషయాన్ని గ్రామ పెద్దల సమక్షంలో పెట్టగా రూ.8 లక్షలు డ్వాక్రా సంఘానికి ఇచ్చిందని, మిగిలిన రూ.4 లక్షల ఇవ్వకుండా కాలయాపన చేస్తుందని, తక్షణమే ఆమెపై చర్యలు తీసుకోవాలని స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పలువురు మహిళలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-నల్లజర్ల

నల్లజర్ల నుంచి పోతవరం వెళ్లే రోడ్డులో హైవే బ్రిడ్జి వద్ద మోటార్ సైకిల్‌ను లారీ ఢీకొనడంతో మహిళ తీవ్రంగా గాయపడింది. ఏలూరుకు చెందిన బత్తుల రమణమ్మ ఆమె కుమార్తె మాధవి కలసి బుధవారం స్కూటర్‌పై తూర్పుగోదావరి పసివేదలకు బయలు దేరారు. వారు నల్లజర్ల చేరుకునే సరికి హైవేపై వాహనాలు అధిక స్పీడ్‌తో వెళతాయనే భయంతో పక్కనే ఉన్న సర్వీస్ రోడ్డుకు మరలారు. ఈ సమయంలో పోతవరం నుంచి నల్లజర్ల వెళుతున్న లారీ వేగంగా వచ్చి మాధవి రమణమ్మ వెళుతున్న స్కూటీని ఢీకొట్టింది. స్కూటీ వెనుక కూర్చున్న రమణమ్మ కాలు లారీ చక్రాల కింద పడి నుజ్జునుజ్జు అయింది. వెంటనే ఆమెను 108లో ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మురుగు కాల్వలో పడి వృద్ధుడు మృతి

ప్రజాశక్తి-మామిడికుదురు

ఆదుర్రులోని మురుగు కాల్వలో పడి కామరాజులంకకి చెందిన వృద్ధుడు బిరుదుగంటి నాగేశ్వరరావు(64) స్నానానికి దిగి మృతి చెందిన సంఘటన మంగళవారం చోటు చేసుకున్నట్టు నగరం ఎస్ఐ చైతన్య కుమార్ బుధవారం తెలిపారు. మృతుని కుమారుడు దుర్గాప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టంకు రాజోలు ఏరియా ఇసుపత్రికి తరలించామన్నారు.

రిలయన్స్ ప్లాంట్‌లో కార్మికుని మరణం

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక ఎడిబి రోడ్డులోని రిలయన్స్ బయో ఎనర్జీ ప్లాంట్ నిర్మాణంలో పని చేస్తున్న కార్మికుడు బుధవారం మృతి చెందాడు. పిఠాపురం మండలం ఎఫ్‌కె పాలెంకు చెందిన రంగనాథం నాగబాబు (36)తో పాటు పదిమంది కార్మికులు ప్లాంట్ నిర్మాణంలో పని చేస్తున్నారు. బుధవారం నాగబాబు పని చేస్తుండగా ప్రమాదవశాత్తు పై నుంచి కింద పడి మృతి చెందాడు. మృతదేహాన్ని పెద్దాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటర్వ్యూలకు 265 మంది హాజరు

ప్రజాశక్తి - చాగల్లు

చాగల్లు ఎంపిడిఒ కార్యాలయంలో వివిధ కార్పొరేషన్ల పరిధిలో రుణాల మంజూరు కోసం నిర్వహించిన ఇంటర్వ్యూలకు 265 మంది హాజరయ్యారని ఎంపిడిఒ ఆర్.శ్రీదేవి తెలిపారు. వివిధ బ్యాంకుల మేనేజర్లు ఈ ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. బ్రాహ్మణగూడెం, చంద్రవరం, మల్లవరం, చిక్కాల, దారవరం, గౌరిపల్లి గ్రామాలకు చెందిన 317 మంది దరఖాస్తు చేసుకున్నారని ఆయన తెలిపారు.

రాజేశ్వరరావు దంపతులకు ఘనంగా సన్మానం

ప్రజాశక్తి- గోకవరం

గోకవరం మహిళా సమైక్య భవనంలో మార్చి 31న ఉద్యోగ విరమణ పొందిన ఇఒపిఆర్‌డి ఎం.రాజేశ్వరరావు దంపతులను మంగళవారం ఎంపిడిఒ ఎం.గోవింద్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి ఎంపిపి సుంకర శ్రీవల్లి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రాజేశ్వరరావు గోకవరం మండలంలో పంచాయతీ కార్యదర్శిగా ఉద్యోగ బాధ్యత నిర్వహిస్తూ ఉద్యోగోన్నతిపై తిరిగి ఇఒపిఆర్‌డిగా వచ్చారన్నారు. ఇక్కడే ఆయన ఉద్యోగ విరమణ పొందారన్నారు. ఆయన సేవలను కొనియాడారు. ప్రతి ఒక్కరూ రాజేశ్వరరావుని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.

అగ్నిపథ్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

అగ్నిపథ్ 2025-26 సంవత్సరానికి రిక్రూట్‌మెంట్ కోసం ఆసక్తి ఉన్న అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ పి.ప్రశాంతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్ సెలక్షన్ టెస్ట్ అవివాహిత పురుష అభ్యర్థుల నుండి ఆన్‌లైన్ దరఖాస్తును ఆహ్వానిస్తున్నట్లు ఆర్మీ రిక్రూటింగ్ కార్యాలయం తెలియజేసిందన్నారు. మార్చి 12 నుంచి ఏప్రియల్ 10వరకూ దరఖాస్తు చేసుకునే అవకావం ఉందన్నారు. దరఖాస్తుదారులు అగ్నివీర్ జనరల్ డ్యూటీ, అగ్నివీర్ టెక్నికల్, అగ్నివీర్ క్లర్క్ / స్టోర్ కీపర్ టెక్నికల్, అగ్నివీర్ ట్రేడ్స్‌మాన్ కేటగిరి కోసం 10వ తరగతి ఉత్తీర్ణత సాధించిన వారు, అగ్నివీర్ ట్రేడ్స్‌మాన్ కేటగిరి కోసం 8వ తరగతి ఉత్తీర్ణత సాధించిన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. www.joinindianarmy.nic.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు.

పాస్టర్ మృతిపై నిష్పక్షపాత విచారణ జరపాలని వినతి

ప్రజాశక్తి - ఉంద్రాజవరం

పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై నిష్పక్షపాత విచారణ జరపాలని కోరుతూ ఉండ్రాజవరంలో క్రైస్తవులు శాంతియుత ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ పిఎన్‌డి.ప్రసాద్‌కు, పోలీస్ స్టేషన్‌లో వినతి పత్రాలు అందించారు. గ్రేస్ పాస్టర్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీలో మండలంలోని క్రైస్తవులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కె.షారోన్‌రాజు, టి.అబ్బులు, సెక్రటరీ యోనాబాబు, జాయింట్ సెక్రెటరీ సుధాకర్, ఆర్‌టి.సాల్మన్, దేవసహాయం పాల్గొన్నారు.

దాతలు సహకారంతో చలివేంద్రం

ప్రజాశక్తి - చాగల్లు

చాగల్లు మండలం మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఎన్ఆర్ఐ డైరెక్టర్ ఆతుకూరి వెంకటేశ్వరరావు సతీమణి ఉషారాణి పుట్టినరోజు సందర్భంగా బుధవారం మజ్జిగను పంపిణీ చేశారు. అలాగే గ్రంధి వెంకటేశ్వరరావు, నాగపర్వతవర్ధనమ్మ పెళ్లిరోజు సందర్భంగా వారి కుమారుడు గ్రంధి సుబ్బారావుగుప్త మజ్జిగను పంపిణీ చేశారు. బోయపాటి రామలక్ష్మి దంపతులు, జజ్జువరపు వెంకటకృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌సి కార్పొరేషన్ రుణాలకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రారంభం

ప్రజాశక్తి - సీతానగరం

ఎస్‌సి కార్పొరేషన్ ద్వారా 2025-26 సంవత్సరానికి పలు యూనిట్ల ఏర్పాటుకు రుణాలు అందించడానికి ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసిందని రాజానగరం ఎంఎల్‌ఎ బత్తుల బలరామకృష్ణ తెలిపారు. ఏప్రిల్ 11 నుంచి మే 20 వరకు రాష్ట్ర వ్యాప్తంగా ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు. మెడికల్ షాపు, మెడికల్ ల్యాబ్, ఎలక్ట్రిక్ బ్యాటరీ ఛార్జింగ్ యూనిట్, ఎలక్ట్రిక్ ఆటో, పాసింజర్ కార్(4 వీలర్), గూడ్స్ ట్రక్ మొదలగు యూనిట్లుకు ప్రభుత్వం ఎస్‌సి కార్పొరేషన్ ద్వారా రుణాలు అందిస్తుందన్నారు. ఆ అవకాశాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

చాగల్లులో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్

ప్రజాశక్తి - చాగల్లు

మండలంలో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్‌ను బుధవారం నిర్వహించారు. ఇందులో భాగంగా చాగల్లు, నేలటూరు, మల్లవరం, దారవరం బ్రాహ్మణగూడెం, నందిగంపాడు, ఊనగట్ల గ్రామ పంచాయతీల్లో పంచాయతీ కార్యదర్శులు ఉదయం ఐదున్నర నుండి, వారి క్లాప్ మిత్రాలతో ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరణ చేశారని ఇఒపిఆర్‌డి ఎన్.శ్రవణ్‌కుమార్ తెలిపారు . ప్రజలకు తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించారు.

మంచి నీటి సమస్యకు పరిష్కారం

ప్రజాశక్తి - చాగల్లు

చాగల గ్రామ పంచాయతీ పరిధిలో మెయిన్ రోడ్ సాయి బాబా గుడి నుంచి తాగునీటి సరఫరా సక్రమంగా ఉండట్లేదని స్థానికులు ఫిర్యాదు చేశారు. ఈమేరకు బుధవారం పంచాయతీ సిబ్బందితో పైపులైనుకు మరమ్మతులు నిర్వహించారు. తాగునీటి సరఫరాను పునరుద్ధరించామని పంచాయతీ కార్యదర్శి మహ్మద్ అలీ తెలిపారు. సుమారు 40 ఏళ్ల క్రితం ఈ పైపులైను వేశారని, పైపులైను చెంతన ఉన్న కొబ్బరి, ఇతర చెట్ల వేర్లు వెళ్లడంతో తాగునీటి సరఫరా నిలిచిపోయిందని తెలిపారు. వాటిని తొలగించామన్నారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

ప్రజాశక్తి - తాళ్లపూడి

మండలంలో అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాలను లబ్ధిదారులతో మాట్లాడి పూర్తి చేయాలని గృహ నిర్మాన శాఖ ఇఇ ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు సూచించారు. లబ్ధిదారుల అంగీకారంతో ప్రభుత్వం నుండి అదనపు నిధులు అందుకున్నవారితో వెంటనే నిర్మాణాలు ప్రారంభించేలా చూడాలన్నారు. బుధవారం తాళ్లపూడికి వచ్చిన ఆయన సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. మండలంలో 97 మంది ఎస్‌సి, ఎస్‌టి, బిసిలకు చెందిన లబ్ధిదారులకు అదనపు నిధులు మంజూరయ్యాయని ఎఇ శ్రీనివాస్ తెలిపారు. ఈ సమావేశంలో డిఇఇ శేఖర్ బాబు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి-నల్లజర్ల

నల్లజర్ల మండలం, దూబచర్ల గ్రామంలోని వసంత కాలనీలో ఇటీవల సంభవించిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన బైరవపాటి వెంకటేశ్వరరావు కుటుంబానికి పార్డ్ ఇండియా స్వచ్ఛంద సేవా సంస్థ రూ.5వేల ఆర్థిక సాయం అందించింవది. ఈ సందర్భంగా అంబటి శ్రీనివాసరావు మాట్లాడుతూ విపత్తుల్లో బాధితులకు అండగా నిలబడటం తమ సంస్థ లక్ష్యం అన్నారు. ఈ కార్యక్రమంలో చీమకుర్తి కృష్ణప్రసాద్, ఎడ్యుకేషన్ అవేర్నెస్ చైర్మన్ బొందల శ్రీనివాసరావు, యోగా మిత్ర రాజారావు, సోమిశెట్టి వెంకటరావు, పార్డ్ డైరెక్టర్ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

రామకృష్ణకు సన్మానం

ప్రజాశక్తి - ఉంద్రాజవరం

ప్రముఖ దాత, సామాజిక సేవా కార్యకర్త, ప్రవాసాంధ్రుడు గారపాటి రామకృష్ణను బుధవారం తాడిపర్రు గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ కరుటూరి నరేంద్రబాబు సత్కరించారు. గ్రామానికి చెందిన రామకృష్ణ ఉపాధి నిమిత్తం కర్ణాటకలోని గంగావతిలో నివాసముంటున్నారు. ఆ ప్రాంతంలో పలువురు నిరుపేదల విద్యాభ్యాసానికి అవసరమైన ఆర్థిక సాయం, అనారోగ్యంతో ఉన్న అనేకమందికి వైద్య సేవలు అందించడంతోపాటు, తెలుగు భాషాభివృద్ధికి ఆయన కృషి చేశారు. ఉగాది పండుగ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, పర్యాటక సాంస్కతిక సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ చేతులు మీదుగా ఉగాది పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ 40 ఏళ్ల నుంచి తాను చేస్తున్న వివిధ సేవలను గుర్తించి, సత్కరించిన ముఖ్యమంత్రి, మంత్రులకు, గ్రామ పెద్దలకు ధన్యవాదాలు తెలిపారు.



ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించిన ఆర్‌డిఒ

ప్రజాశక్తి-రామచంద్రపురం

మండలంలోని వెల్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని రామచంద్రపురం ఆర్‌డిఒ దేవరకొండ అఖిల బుధవారం పరిశీలించారు. వైద్యుల హాజరు పట్టీని పరిశీలించి సిబ్బంది సక్రమంగా విధులకు హాజరవుతున్నదీ లేనిదీ గమనించారు. సమయ పాలనతో రోగులకు సేవలు అందిస్తున్నదీ లేనిదీ రోగులను అడిగి తెలుసుకున్నారు. అవుట్ పేషంట్ రిజిస్టర్లను తనిఖీ చేసి ఎంత మంది రోగులు వైద్య సేవల నిమిత్తం వస్తున్నదీ పరిశీలించారు. ప్రసూతి విభాగంలో నెలవారీ ఎన్ని కాన్పులు ఎన్ని నిర్వహిస్తున్నదీ రికార్డులను తనిఖీ చేశారు. సీజనల్ వ్యాధులైన జ్వరాలు ఇతర వ్యాధుల తీవ్రతను వైద్యులను అడిగారు. ల్యాబ్‌లో అన్ని రకాల వైద్య పరీక్షలు, మందులు అన్నీ ఆసుపత్రిలో ఇస్తున్నారా లేదా బయటకు వెళ్లి రోగులను తెచ్చుకోమంటున్నా అని ఆరా తీశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఆసుపత్రి నిర్వహణ తీరును మెరుగు పరచాల్సిన అవసరం ఉందని, రికార్డుల ఆధారంగా చిన్నపాటి లోపాలను గుర్తించామని, వాటిని సరి చేసుకోవాలని వైద్యాధికారులకు సూచించారు. ఈ కార్యక్రమాలలో ఎంపిడిఒ పద్మా జ్యోతి, ఇఒపిఆర్‌డి సెలెట్ రాజు, ద్రాక్షారామ సర్పంచ్ అరుణ, డాక్టర్ ప్రసన్న, డాక్టర్ అలేఖ్య తదితరులు పాల్గొన్నారు.



ఆరోగ్య కేంద్రంవైద్యులతో మాట్లాడుతున్న ఆర్‌డిఒ

డైనింగ్ హాల్ ప్రారంభం

ప్రజాశక్తి-అయినవిల్లి

విలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థి, సిఐ కొప్పిశెట్టి రామకృష్ణ సహకారంతో రూ.లక్ష వ్యయంతో ఆధునికీకరించిన విద్యార్థుల భోజనశాలను డిఇఒ ఎస్‌కె.సలీంబాషా, వైసిపి పి.గన్నవరం నియోజకవర్గ కో ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ దాతల సమన్వయంతో పాఠశాలలోని పిల్లలందరి కోసం చక్కని భోజనశాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఎంపిపి మట్టపర్తి నాగ విజయలక్ష్మి, సిఎంఒ సుబ్రహ్మణ్యం, ఎఎంఒ రాంబాబు, డిఎస్ఒ సుబ్రహ్మణ్యం, ఎస్ఎంసి చైర్మన్ చక్రవర్తి, ఎంపిటిసి కె.ఈశ్వరి రాంబాబు, పాఠశాల హెచ్ఎం పివి.రవిప్రసాద్ పాల్గొన్నారు.

అమరావతి కళావేదిక ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఈ నెల 4న రాజమహేంద్రవరంలో నిర్వహించనున్న అమరావతి కళావేదిక కార్యక్రమ ఏర్పాట్లను ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక కళల విభాగం రాష్ట్ర డైరెక్టర్ ఆర్.మల్లికార్జునరావు బుధవారం పరిశీలించారు. స్థానిక సెంటర్ జైల్ రోడ్‌లో ఏర్పాటు చేస్తున్న స్టాల్స్‌ను పరిశీలించారు. శిబిరాలను ఆనుకొని ఉన్న రాజమండ్రి కేంద్ర కారాగారాన్ని సందర్శించారు. సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ ఎస్.రాహుల్ ఆయనకు స్వాగతం పలికారు. స్టాల్స్ నిర్వహణకు సహకరించాలని మల్లికార్జునరావు ఆయన్ని కోరారు. తమ పూర్తి సహకారం ఉంటుందని, అలాగే జైల్లో ఖైదీలు తయారు చేసిన కళాత్మక వస్తువులు ఉన్నాయని వాటితో జైలు శాఖ తరుపున ఒక స్టాల్‌ని కూడా ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాజమండ్రి సెంట్రల్ జైల్ జైలర్ దుర్గా రమేష్, రాజమండ్రి నృత్య కళాశాల ప్రిన్సిపల్ నాగలక్ష్మి జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడు చిలుకూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

టిడిపి నేత జనార్ధన్‌కు శ్రీనివాసరావు శుభాకాంక్షలు

ప్రజాశక్తి-అంబాజీపేట

టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు, రాజకీయ కార్యదర్శి తొండాపు దశరథ జనార్ధన్ గారిని మంగళగిరి పార్టీ కార్యాలయంలో రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి పెదపూడి శ్రీనివాసరావు మర్యాద పూర్వకంగా కలిశారు. ముందుగా ఎయిర్‌పోర్ట్ లో కలసి పుష్పగుచ్చం అందించి శుభాకాంక్షలు తెలిపారు. పుట్టినరోజు వేడుకలలో పాల్గొని కేక్ కట్ట చేసి పూలబొకే అందజేసి జన్మదినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్

అంగన్‌వాడీ స్థలం కబ్జాపై ఫిర్యాదు

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

విలసవిల్లి దేవాంగుల కాలనీలో అంగన్ వాడీ కేంద్రం భవన నిర్మాణానికి కేటాయించిన ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఎం.రమా దేవి బుధవారం అధికారులకు ఫిర్యాదు చేశారు. విలసవిల్లిలో ఐదు సెంట్ల ప్రభుత్వ భూమిని అంగన్‌వాడీ భవన నిర్మాణానికి పంచాయతీ తీర్మానం చేసినట్టు తెలిపారు. భవన నిర్మాణానికి నిధులు మంజూరై నిర్మాణం చేపట్టే సమయంలో ఆ స్థలంలో గ్రామానికి చెందిన వ్యక్తి కబ్జా చేసి పాక నిర్మాణం చేపట్టారని ఫిర్యాదుల పేర్కొన్నారు.